క్లుప్తంగా

వేచలం హైస్కూల్‌కు కంప్యూటర్ల వితరణ



వేచలం హైస్కూల్లో దాతలు బహూకరించిన కంప్యూటర్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దేవరాపల్లి :వేచలం జిల్లా పరిషత్ **ఉన్నత పాఠ** శాలకు విశాఖపట్నానికి చెందిన **ఎస్ఎన్ఎఫ్** ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు **ఐదు కంప్యూటర్లు**, లేజర్ ప్రింటర్‌తో పాటు **పది టేబుళ్లు**, పది కుర్చీలను బహూకరించారు. **హైస్కూల్** ప్రధానోపాధ్యాయుడు దేవుపల్లి **నర్సింహమూర్తి** సమక్షంలో సోమవారం వాటిని **అందజే** శారు. ఎస్ఎన్ఎఫ్ సంస్థ ద్వారా **ఈ సేవా కార్య** క్రమం విద్యార్థుల పురోగతికి దో**హదపడుతుం** దని పలువురు అభినందించారు. **ఎస్ఎన్ఎఫ్** సంస్థ ప్రతినిధులు అనూజ మిశ్ర, **ఈర్లి సన్యాసి** నాయుడులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శరారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి, పూర్వ విద్యార్థులు కె.శ్రీనివాసు, రెడ్డి త్రినాథ్, బత్తి నాయుడు, సత్యారావు, రామారావు, జి.కన్నంనాయుడు, నౌడు అప్పారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



కుసుర్లపూడిలో ఉపాధి పనుల వద్ద ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

రోలుగుంట : పది రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం చేపట్టారు. కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శెట్టి మోహనరావు ఉపాధ్యాయ బృందంతో కలసి విద్యార్థుల ఇళ్ల వద్దకు, జన సమూహాల వద్దకు, ఉపాధి పనుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందించే నాణ్యమైన విద్య, ఉచిత పథకాలు, పాఠశాలల్లో బోధన, మౌలిక సదుపాయాలపై ప్రచారం చేశారు.

గ్రంథాలయానికి ఇన్వెర్టర్ బహూకరణ



గ్రంథాలయానికి ఇన్వెర్టర్‌ను అందజేస్తున్న పైల సన్యాసమ్మ

రావికమతం : కొత్తకోట గ్రంథాలయానికి రూ.15 వేల విలువ గల ఇన్వర్టర్‌ను పైల సన్యాసమ్మ, వారి కుమారులు సోమవారం వితరణగా అందచేశారు. గ్రంథాలయానికి నిత్యం వివిధ గ్రామాల నుంచి యువకులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు వస్తూంటారు. వేసవి దృష్ట్యా గ్రంథాలయానికి ఇన్వెర్టర్ అవసరాన్ని గుర్తించి పైల సన్యాసమ్మ ఈ వితరణ చేశారు. ఆమెకు గ్రంథ పాలకురాలు వరహామణి ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు వెంకన్నపాలెం సాయి మందిరం వార్షికోత్సవం



చోడవరం : వెంకన్నపాలెం సాయిబాబా మందిరం వార్షికోత్సవం ఈనెల 22వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్టు గోవాడ సుగర్స్ మేనేజింగ్ డైరక్టర్ వి.వి సన్యాసినాయుడు చెప్పారు. ఈ మందిరాన్ని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ 25 ఏళ్ల కిందట నిర్మించింది. ఉదయం 6 గంటలకు కాకడ హారతితో స్వామివారికి వార్షికోత్సవ పూజలు ప్రారంభమౌతాయి. 9 గంటలకు సామూహిక సాయి సత్య వ్రత పూజలు, 12గంటలకు భారీ అన్న సంతర్పణ, సాయంత్రం 4గంటలకు బాబా వారి తిరువీధోత్సవం వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. 23వ తేదీన 9గంటలకు 12వ స్థాపన వార్షికోత్సవం సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ అర్చకులు తెలిపారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



బూరుగుపాలెంలో ఇంటింటి సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేపట్టారు. మండలంలోని బూరుగుపాలెం, యరకన్నపాలెం, శెట్టిపాలెం, తదితర గ్రామాల్లో సోమవారం ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న పథకాలు, వసతులను తెలియజేశారు.



పట్టణంలో నిర్మించిన టిడ్కో గృహాలు

లబ్ధిదారుల ఎదురు చూపు

ముందుకు సాగని మౌలిక సదుపాయాల కల్పన

టిడ్కో గృహాలు.. సాకారమెప్పుడు!

నర్సీపట్నం : కూటమి ప్రభుత్వం కొలువు తీరి సుమారు ఏడాది కావస్తున్నా టిడ్కో గృహ నిర్మాణాల్లో ఎలాంటి పురోగతి లేదు. టిడ్కో గృహాల సాకారం కోసం లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు ముందుకు సాగడం లేదు. 2014లో టిడ్కో గృహ నిర్మాణాలను టీడీపీ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది. వైఎస్సార్ **సీపీ ప్రభుత్వంలో కిటికీలు, తలుపులు, టైల్స్, వైరింగ్, పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో మౌలిక సదుపాయాల** పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు ఏడాది అవుతున్నా మౌలిక సదుపాయాల ఊసెత్తడం లేదు.

నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి బయపురెడ్డిపాలెం, బలిఘట్టం వద్ద 2016లో టీడీపీ ప్రభుత్వం రూ.150 కోట్లతో 1800 టిడ్కో గృహ సముదాయాన్ని ప్రారంభించింది. సకాలంలో పూర్తి చేయకపోవడంతో వివిధ దశల్లో గృహాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అప్పట్లో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అసంపూర్తిగా ఉన్న ఫ్లాట్లను డ్రా తీసి లబ్ధిదారులకు కేటాయించారు. అసంపూర్తిగా ఉండడంతో లబ్ధిదారులు ఎవరూ ఇళ్లల్లోకి వెళ్లలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మాణాలను పూర్తి చేసింది. **ఎన్నికలు సమీపిం**చడంతో మౌలిక సదుపాయాల**కు బ్రేక్ పడింది**. అధికారం చేపట్టిన కూటమి **ప్రభుత్వం మౌలిక** సదుపాయాలను గాలికి వది**లేసింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్** ఓవర్ హెడ్ ట్యాంకు, **ప్రధాన, అంతర్గత** రోడ్లు, నీటి సరఫరా, డ్రైయిన్ల **కల్పనకు రూ.20.31** కోట్లు, ఎస్టీపీ ట్యాంకులు **నిర్మాణంకు రూ.4.85** కోట్లు అవసరమవుతుందని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. ప్రభుత్వ వైఖరితో లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి.

> **నిధుల కొరత ఉంది**
>
> మౌలిక సదుపాయాలకు నిధుల కొరత ఉంది. పెండింగ్ బిల్లులు ఉండడంతో కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాల వస్తే సత్వరం పనులు చేపడతాం.
>
> – సంధ్య, టిడ్కో డీఈ

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



కూరగాయలు విక్రయిస్తున్న సిబ్బంది

నాతవరం: సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలు ఆరోగ్యదాయకమని వెలుగు ఏపీఎం కనకరాజు అన్నారు. మండల కేంద్రంలో వెలుగు కార్యాలయం వద్ద సోమవారం రైతు సాధికారిత సంస్థ అధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులంతా దృష్టి సారించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో ఊహించిన విధంగా గిరాకీ ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు అచ్చెర్ల దుర్గ మాతాజీ, బయపురెడ్డి ధనలక్ష్మి, చంద్రిక పాల్గొన్నారు.

‘ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి’



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరతగతిన పరిష్కరించాలని ఆర్డీవో వి.వి.రమణ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్యలతో పాటు వివిధ రకాల సమస్యలపై మొత్తం 14 ఫిర్యాదులు వచ్చాయి. తన భూమికి మ్యూటేషన్ చేయాలని కోరుతూ మాకవరపాలెం మండలం, సీతన్నఅగ్రహారంకు చెందిన పాము అప్పలనాయుడు దరఖాస్తు పెట్టుకున్నారు. వేరొకరి పేరు మీద నమోదు చేసిన తన భూమిని సరి చేసి తనకు న్యాయం చేయాలని గొలుగొండ మండలం, ఏజెన్సీలక్ష్మీపురానికి చెందిన బొడ్డు వరలక్ష్మి దరఖాస్తు చేసుకుంది. రోడ్డు వేసేందుకు ఆటంకం లేకుండా చూడాలని కోరుతూ నర్సీపట్నం మండలం, గురందరపాలెం సర్పంచ్ శానపతి వెంకటరత్నం ఆర్డీవోకు విన్నవించారు. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య

ఎ.కొత్తపల్లిలో హైస్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ సత్య వెంకటరమణ

దేవరాపల్లి: బడి ఈడు పిల్లలందర్నీ సర్కారు బడిలో చేర్పించాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి కోరారు. ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గ్రామంలో బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అవగాహన పరుస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్లకార్డులు పట్టుకొని నినదించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

26న చోడవరంలో మెగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం : నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 26వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు సోమవారం తెలిపారు. చోడవరం గవర్నమెంటు కాలేజీ ఆవరణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్‌మేళా ప్రారంభమౌతుందని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులంతా తమ విద్యార్హతతో కూడిన సర్టిఫికెట్లు తీసుకొని మేళాకు హాజరవ్వాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగి 10వ తరగతి పై చదువులు చదువుకొని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతీ, యువకులంతా ఈ జాబ్ మేళాను సద్వినియోగంచేసుకోవాలన్నారు. ప్రముఖ కంపెనీలన్నీ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని చెప్పారు.

మాకు పని కల్పించండి మహాప్రభో...

మేట్ మార్పును వ్యతిరేకించినందుకు వీఆర్‌పీ వివక్ష



పని కల్పించాలంటూ రోడ్డెక్కిన కూలీలు

చీడికాడ : తమకు తెలియకుండా మేట్‌ను మార్చడంపై వీఆర్‌పీకి వ్యతిరేకంగా ధర్నా చేసి ఫిర్యాదు చేసిన కూలీలకు పని కల్పించకుండా మస్టర్ నమోదు చేయలేదంటూ మండలంలోని బైలపూడికి చెందిన చంద్రాదేవి గ్రూపు ఉపాధి కూలీలు ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ తమకు తెలియకుండా వీఆర్‌పీ, ఏపీఓలు తమ గ్రూపు మేట్ జె.చంద్రాదేవిని తొలగించి ఆమె స్థానంలో గాడి వరలక్ష్మిని నియమించడంతో నాలుగు రోజుల క్రితం ఎంపీడీవో కార్యాలయం వద్ద వీఆర్‌పీకి వ్యతిరేకంగా కూలీలు ధర్నా నిర్వహించారు. దీనిపై విచారణ చేస్తామని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం పనికోసం 16 మంది కూలీలు వెళ్లారు. వెళ్లిన కూలీలను వీఆర్‌పి గాడి సత్యనారాయణ కొత్తగా నియమించిన మేట్‌తో ఫోటోలు తీసుకుంటేనే పని కల్పించి మస్టర్ నమోదు చేస్తామనడంతో తాము ఒప్పుకోలేదని జాజిమొగ్గల చంద్రాదేవి, అప్పారావుతో పాటు కూలీలు తెలిపారు. అయితే మీకు పని కల్పించనని వీఆర్‌పి చెప్పాడన్నారు. తాము పనిచేశామని ఈ విషయాన్ని ఏపీవో గంగునాయుడు, ఎంపీడీఓ హేమసుందరరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. మేట్‌తో సంబంధం లేకుండా పని కల్పిస్తామని చెప్పిన ఏపీవో, ఎంపీడీఓ స్పందించలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉపాధి నిధులతో తాండవ కాలువలో పూడికతీత



తాండవ కాలువలో పూడికతీత పనులకు భూమి పూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నాతవరం: తాండవ కాలువలో ఉపాధి హమీ పథకం నిధులతో పూడికతీత పనులు చేపట్టినట్టు ఏపీవో దాసరి కొండాజీ అన్నారు. మండలంలో చమ్మచింత పంచాయతీ శివారు తాండవ ప్రాంతంలో తాండవ ప్రధాన కాలువలో పూడికతీత పనులకు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హమీ పథకం నిధులతో 19 పనులు కోటి 50 లక్షలతో పూడికతీత పనులు చేస్తామన్నారు. 52 వేలు పని దినాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ, చమ్మచింత మాజీ ఎంపీటీసీ సభ్యుడు నూకరాజు, తాండవ నీటి సంఘం అధ్యక్షుడు మిడతాన ప్రసాద్, రైతులు, తాండవ సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి



కాటపల్లి అప్పారావును సత్కరిస్తున్న పలువురు నాయకులు, అధికారులు

దేవరాపల్లి : రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడి, మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే, డా. బిఆర్. అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఆతవ ఉదయ్ భాస్కర్ అన్నారు. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం ఆవరణలో సోమవారం అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పూలే, అంబేడ్కర్ జయంతోత్సవాల సభను ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ మండల కేంద్రంలో అంబేడ్కర్ భవనం నిర్మాణం, జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు, పార్కు స్థలంలో బుద్ధుడి విగ్రహం నెలకొల్పేందుకు అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్ర స్థాయి అంబేడ్కర్ సేవా రత్న అవార్డు అందుకున్న కాటపల్లి అప్పారావును పలువురు నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. బహుజన కళా మండలి సభ్యులు ఆలపించిన పలు చైతన్య గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో సువర్ణరాజు, ఎంఈవో పడాల్‌దాస్, సర్పంచ్ పెంటమ్మ, రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరక్టర్ డా.సింహాచలం నాయుడు, ఎల్లేటి కరుణాకర్‌రావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, గండిపడాల అప్పలరాజు, వేమల కన్నబాబు, దళిత నాయకులు గొల్ల ఈశ్వరరావు, మరువాడ ఈశ్వరరావు, పతివాడ నాగభూషణం, కార్లి సాయి సుందరరావు, సబ్బవరపు మాలిబాబు, కొండలరావు, కంచిమాల అప్పారావు, కాటపల్లి ఈశ్వరరావు, మచ్చ వీర్రాజు, రామారావు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

దేవరాపల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు విధిగా తగు సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

ఆక్రమణ తొలగించాలని ఫిర్యాదు

మాకవరపాలెం : ప్రభుత్వ స్థలం ఆక్రమణను తొలగించాలని సర్పంచ్ అల్లంపల్లి శిరీష తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గత పశువైద్య కేంద్రం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురైందని, దీనిని తొలగించాలని సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం సభ్యులు ఎలాంటి అనుమతి లేకుండా అనధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను నిలుపుదల చేయాలని ఎంఈవోకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

రేపు ఉచిత మెగా దంత వైద్య శిబిరం

మాడుగుల రూరల్ : ఈ నెల 23 వ తేదీదన మాడుగుల గవరవీధిలో గల వైభవ సీతారామాలయం వద్ద ఉచిత మెగా దంత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు రాపేట రామకొండలరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కె.జె.పురం కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం, భానోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా అనిల్ నీరుకొండ ఆస్పత్రి వారి సహకారంతో, బొడ్డేడ గంగాధర్ (విశ్వహిందూ పరిషత్ మండల సేవా ప్రముఖ్) వారి ప్రోత్సాహంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, నిపుణులైన దంత వైద్యులతో దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి దంతాలు శుభ్రం చేయడం, సిమెంటు పెట్టడం, రూట్ కెనాల్ ట్రీట్‌మెంటు ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9885650716 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు



డి.అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న కార్యకర్త వెంకటలక్ష్మి

కె.కోటపాడు :చిరుధాన్యాలతో కూడిన ఆహారంలో అధికంగా పోషక విలువలు ఉంటాయని డి.అగ్రహారం అంగన్‌వాడీ కార్యకర్త వేచలపు వెంకటలక్ష్మి అన్నారు. గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉండేందుకు ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలపై విద్యార్థులకు అవగాహన



వడ్డాది బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

బుచ్చెయ్యపేట : వడ్డాది మెయిన్ స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాల పనితీరు సేవలపై అవగాహన కల్పించారు. సోమవారం హెచ్‌ఎం ఐదో తరగతి విద్యార్థులను పంచాయితీ, సచివాలయం, స్టేట్ బ్యాంకు, ఐఓబీ బ్యాంకు, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, పోస్టాఫీసులకు తీసుకువెళ్లి అక్కడ ప్రజలకు అందుతున్న సేవల గురించి విద్యార్థులకు వివరించారు.

ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో పాండురంగారావు, దేవుడమ్మ

మాడుగుల : ఈ విద్యాసంవత్సరానికి ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద కుటుంబాల విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మాడుగుల ఎంఈవోలు ఎం. పాండురంగారావు, బి.దేముడమ్మ అన్నారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సీలో ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐబీఐసీఎస్, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ఈ నిబంధనలు వర్తిస్తాయన్నారు. ఈ 25 శాతంలో ఎస్సీ 10 శాతం, ఎస్టీ 4 శాతం, బీసీ మైనారిటీలు 6 శాతం అనాథలు, హెచ్ఐవీ పీడితులు, దివ్యాంగులు 5 శాతం కేటాయింపు జరుగుతుందన్నారు. గ్రామీణ ఆదాయ పరిమితులు గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.1.44 లక్షలలోపు ఉండాలన్నారు. ఈ నెల 19 నుంచి వచ్చే నెల 26 వ తేదీలోపు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్ రిజిస్ట్రేషన్ సీఎస్ఈ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 వ తేదీ నుంచి మే నెల 15వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతందన్నారు. మే 16 నుంచి 20 వరకు విద్యార్థుల అర్హత నిర్ధారణ, మే 21 నుంచి 24 వరకూ లాటరీ ద్వారా మొదటి విడత ఎంపిక జాబితా సిద్ధం చేస్తారన్నారు. జూన్ 2 వ తేదీ నుంచి మొదటి విడత విద్యార్థుల చేరికలు జరుగుతాయన్నారు. జూన్ 12 వ తేదీన, రెండో విడత చేరికలు జరుగుతాయన్నారు. పై అర్హతలు గల 5 ఏళ్లు దాటిన విద్యార్థులు 1 వ తరగతిలోకి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఎంఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది రాజు, నాగేంద్ర, సీఆర్‌పీలు వొమ్మలి అచ్చుతరావు, బొబ్బిలి హరి కృష్ణ, సంధ్య పాల్గొన్నారు.

మాకవరపాలెం: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని ఎంఈవో మూర్తి సూచించారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాహక్కు చట్టం సెక్షన్-(1) సి ప్రకారం ప్రతి పాఠశాలలోనూ 25శాతం ఉచిత సీట్లు తప్పనిసరిగా కేటాయించాలన్నారు. వాటికి సంబంధించిన నిబంధనలపై వివరించారు.

దేవరాపల్లి : ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లలో 2025-2026 విద్యా సంవత్సరానికి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని మండల విద్యాశాఖ అధికారి బి.పడాల్‌దాస్ తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ఈ నిబంధనలు వర్తిస్తాయన్నారు. మే 15లోపు ‘సీఎస్ఈ’ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మే 16న విద్యార్థుల అర్హతల నిర్ధారణ, మే 21న మొదటి విడత లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని అన్నారు. జూన్ 2న మొదటి విడత విద్యార్థుల చేరికలు ఉంటాయన్నారు. ఐదు సంవత్సరాలు దాటిన బాల, బాలికలు 1వ తరగతిలో అడ్మిషన్లు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూన్ 6న రెండో విడత లాటరీ ద్వారా ఎంపిక చేసి, 12న విద్యార్థులు పాఠశాలల్లో చేరుతారన్నారు. ఫ్రీ సీట్లు పొందే తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతానికి రూ.1.20 లక్షలలోపు ఉన్న వారు మాత్రమే అర్హులని ఎంఈవో పడాల్‌దాస్ స్పష్టం చేశారు. సమావేశంలో క్రైస్ట్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.కె.దినేష్, మదర్ థెరిస్సా స్కూల్ కరస్పాండెంట్ ఎస్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉత్తమ బోధన



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు ఉత్తమ బోధన అందుతుందని మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ అన్నారు. పాచిలవానిపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సోమవారం హెచ్‌ఎం ఎస్.వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సూర్యనారాయణ మాట్లాడుతూ హెచ్‌ఎం వీరాంజనేయులు తన సొంత ఖర్చుతో పాఠశాలకు మరమ్మతులు జరపడంతో పాటు పాఠశాల ప్రాంగణాన్ని పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా రూపొందించారని, హెచ్‌ఎం పాఠశాల నిర్వహణపై చూపిస్తున్న శ్రద్ధ వల్ల రెండేళ్లలో అడ్మిషన్లు బాగా పెరిగాయని అన్నారు. వార్షికోత్సవం సందర్భంగా 1 నుంచి 5 తరగతుల్లో టాపర్‌లుగా నిలుస్తున్న విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్‌ఎం వీరాంజనేయులు, ఉపాధ్యాయిని సత్యవతి, వార్డు సభ్యుడు గండి సత్యం పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు, బీజేపీ నాయకులు

రావికమతం: మర్రివలస గ్రామంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఆ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు, బీజేపీ నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం తహసీల్దార్ బి.వెంకటరమణకు వినతి పత్రం అందచేశారు. ప్రాథమికోన్నత పాఠశాలను అనుకుని రోడ్డు పక్కన రెండున్నర సెంట్లు గ్రామ కంఠం ఖాళీ స్థలం ఉందని అక్కడ అంబేడ్కర్ విగ్రహం పెట్టుకునేందుకు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ , గ్రామ పంచాయతీ అంగీకారం తెలిపిందని తీర్మానం కాపీని తహసీల్దార్‌కు అందజేశారు. స్థలం కేటాయింపునకు తహసీల్దార్ వెంకటరమణ అంగీకారం తెలిపారని అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు నక్కా సత్యనారాయణ, రాంబాబు, సత్యనారాయణ తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పట్టవా...!



నిరసనలో పాల్గొన్న పారిశుద్ధ్య సిబ్బంది, సీపీఎం నాయకులు

కె.కోటపాడు : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది సమస్యలను సంబంధిత పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్.ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం పారిశుద్ధ్య సిబ్బంది సమస్యలపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టి సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బందికి కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. గుర్తింపుకార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు లేవన్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి సరైన పనిముట్లు లేవన్నారు. పవన్‌కల్యాణ్ పదవీ బాధ్యతలు చేపట్టి సుమారు 10 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ పారిశుద్ధ్య సిబ్బంది సమస్యలపై దృష్టి పెట్టకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు వి.వెంకటరావు, నాగరాజు, చిన్ని పైడితల్లి, రామారావు, సముద్రం పాల్గొన్నారు.